# తీర్పు

తులసీరాం

**స్నేహితుడ్ని రైలు ఎక్కించి ఫ్లాటుఫారం మీద నెమ్మదిగా నడిచి వస్తున్నా.**

**స్నేహితుడు బెంగుళూర్ వెళుతున్నాడు.**

**కదిలిపోతున్న ఎక్స్‌ప్రెస్ రైల్లో ఓ కంపార్ట్ మెంటు డోర్ దగ్గర నా ఫ్రెండ్ చెయ్యి వూపుతుంటే చేయి ఆడిస్తూ వస్తున్నాను.**

''రేయ్ ఇంకోసారి గనుక ఇట్లాంటి దొంగ పనులు చేస్తూ నా కంట పడ్డారో మిమ్మల్ని బొక్కలోకి తోసేస్తా'' అంటూ లాఠీ పట్టుకొని రైలు ఎక్కుతున్న ఓ మఫ్టీ పోలీసు మాటలు విని అటు తిరిగే సరికి రైలు వేగం పుంజుకొని ప్లాటుఫారం దాటేసింది.

ఆ పోలీసు ఆ మాటలు ఎవర్ని గురించి అన్నదీ క్షణంలోనే అర్థమయ్యింది. అక్కడ కొట్టుకుంటున్న కుర్రాళ్ల గురించే అయ్యుంటుందని అనుకొన్నాను.

కొట్టుకుంటున్న ఆ ఇద్దరి వయసు దాదాపు పదిహేనేళ్లలోపే వుంటుంది.


కాకపోతే ఒకడు ఎర్రగా, మరొకడు కాస్త నల్లగా వున్నారు. బక్కచిక్కిన శరీరాలు, చినిగిన చొక్కాలు బాగా పెరిగిపోయిన నెత్తి మీది జుత్తు.

ఒకడు ఎడమ చేత్తో మరొకడు నెత్తిమీది జుత్తు పట్టుకొని కుడిచేత్తో పొట్ట మీద, గుండెమీద పొడిచేస్తున్నాడు. ఆ రెండో వాడు తన కాళ్లతో వాడి మర్మావయవాలపైనా, పొట్టపై బలవంతంగా తంతున్నాడు.

''రేయ్...లం....కొడకా...'' అని ఒకడంటే, ''నీ యమ్మ....నా కొడకా...'' అని మరొకడు.

ఇద్దరూ సరిసమానంగా ఎక్కడ పడితే అక్కడ పిడిగుద్దులు గుద్దుకుంటూ నెత్తి మీది జుత్తు పీకేస్తూ కుస్తీ పడుతున్నారు. ఇద్దరూ బాలెన్సు తప్పి ప్లాటుఫారం మీద పడిపోయారు.

కిందపడ్డ కుర్రాడి మీద రెండోవాడు వాడి పొట్టమీద



కూర్చుని చెంపల మీద, తల మీద బలంగా తన్నే స్తున్నాడు. కింద పడ్డ కుర్రాడు గిజగిజలాడుతూనే బలమంతా ఉపయోగించి పొట్టమీద కూర్చున్న వాడి పీక రెండు చేతులతో గట్టిగా అదిమి పట్టు కొని, కాళ్లతో కొడుతూ, వాడిని అటూ ఇటూ వూపి ఒక్కసారి కింద పడేసి, వీడు వాడిపైకి ఎక్కి రొమ్ముల మీద గుద్దేస్తున్నాడు.

వీళ్లిద్దరి ఫైటింగ్ సీన్... ప్లాట్‌ఫారం మీదున్న ప్రయాణీకులు వింతగా చూస్తున్నారు. ''రేయ్... ఆగండర్రా...'' అని కూడా అక్కడున్న వాళ్లెవరూ అన్లేదు.

ప్లాటు ఫారం వారిద్దరి కుస్తీ పోటీల స్థలం అన్న ట్టుగా భావించి ఉచిత ప్రదర్శనలా మౌనంగా చూస్తున్నారు.

ప్లాటుఫారం మీద బాగా కొట్టుకొని కిందా మీద పడిపోయి, అలసిపోయి రొప్పుతున్నారు.

నేను ఆ వింతను అట్టే చూడలేక ''రేయ్... ఆగండి'' అని గట్టిగా అరిచాను. వున్నట్టుండి నా కేక పిడుగుపడ్డట్టు అనిపించిందేమో ఇద్దరూ సడె న్‌గా కొట్టుకోవడం ఆపేశారు.

నెమ్మదిగా పైకి లేచి చినిగిన చొక్కాలకు పట్టిన ప్లాటుఫారం మీది దుమ్మును దులుపుకొని వెర్రి ముఖాలతో నిలబడ్డారు మౌనంగా...

వాళ్లను చూస్తే జాలి వేసింది. వాళ్లిద్దరినీ కోసి తీసి తూకం వేసినా పదికిలోల మాంసం లేదు. కళ్ల ల్లోని కన్నీరు తొంగి తొంగి చూస్తోంది. చెంపల మీద నుంచి జారిపడడానికి.

గట్టిగా వేసిన నా కేకతో వాళ్లిద్దరూ కొట్టుకో వడం ఆగిపోయినందుకు లోలోన సంతోషప డ్డాను.

''ఎందుకురా... అట్లా కొట్టుకు ఛస్తున్నారు?'' వాళ్లిద్దరి వైపు కోపంగా చూస్తూ అడిగాను. వాళ్లి ద్దరు బాగా గోసపెడుతూ మాట్లాడలేని స్థితిలో వున్నారని గమనించాను.

''సిగ్గులేదురా మీకు? కుక్కల్లాగా ప్లాట్ ఫారం మీద మనుషులందరూ చూస్తూంటే తన్నుకోవడా నికి...నేనెవరో తెలుసా? ఎస్.ఐని . పదండి స్టేషన్‌కి రాస్కెల్స్...'' అని వారిద్దరి భుజాల మీద చేతులు వేసి ముందుకు తోశాను బలంగా...

వాళ్లిద్దరూ కిమ్మనకుండా తలలు దించుకొని నా ముందు నడుస్తున్నారు. నేను ఆ నిమిషంలో ఆడిన అబద్ధం ఎవ్వరికీ తెలియదు. ఆ క్షణంలో వారిద్దరి ముందు నేను పోలీస్ ఇన్స్‌పెక్టర్‌ని అంటే గాని ఆ వెధవలు భయపడి లొంగిపోరని అన్నాను. పోలీ సులంటే భయపడేంత ఇదిగా ప్రజలు లేకపో వచ్చు. కానీ ఈ సందర్భంలో ఈ కుర్రాళ్లని భయపె ట్టాలంటే చిన్న అబద్ధం ఆడవలసి వచ్చింది. నేను ఎస్ఐని అని చెప్పడం శుద్ధ అబద్ధం. నేను ఓ సామాన్యమైన ఉద్యోగస్తుడిని. అయితే నా పర్సనా లిటి చూస్తే మాత్రం ఓ పోలీసు అధికారిగా కనిపి స్తాను. ఆ కుర్రాళ్లిద్దర్ని అలా అలా ఆ ప్లాటుఫారం చివరివరకూ నడిపించాను మౌనంగా...

అక్కడ ప్రయాణీకులు ఎవ్వరూ లేరు. ఖాళీగా వున్న పొడవాటి సిమెంటు బెంచీ మీద కూర్చు న్నాను. వాళ్లిద్దరూ నాకు ఎదురుగా తల దించు కొని నేరం చేసిన ముద్దాయిల్లా నిలబడ్డారు.

''ఎందుకురా? ఆ ఎర్రోణ్ని అలా తన్నా వు'' అని గద్దించి అడిగాను నల్లగా వున్న కుర్రాణ్ని.

''సార్... వాడేనన్ను ముందుగా జుట్టు పట్టుకొని కొట్టాడు సార్'' అన్నాడు నల్లోడు.

''ఏరా..తిన్నది అరగలేదా? పెద్ద ఫైల్మాన్‌లా, పొగరెక్కి కొట్టావురా వాణ్ని...'' అన్నాను ఎర్రోని కళ్లల్లోకి చూస్తూ...

''సార్..వీడు కంపార్ట్‌మెంటులో నాకు దొరికిన పర్స్ లాక్కోబోయాడు సార్...'' అన్నాడు.

''ఆ పర్స్‌ను ఎక్కడ కొట్టేశావురా?'' నా ప్రశ్న.

''కొట్టేయలేదు సార్... స్లీపర్ కోచ్ కంపార్ట్ మెంటులో ప్యాసింజర్లు తిని పడేసిన చెనిక్కా యల పొట్టు, అరటి తొక్కలు చెత్తా చెదారం, కాయితాలు తుడుస్తుంటే ఓ సీటు కింద నల్ల పర్సు ఒకటి దొరికింది సార్. అది తీసుకొని నా జేబులో పెట్టుకున్నాను. ప్రయాణీకులు ఎవరైనా అడిగితే ఇచ్చేద్దామనుకున్నాను. కానీ నేను పర్సు జేబిలో పెట్టుకుంది ఎవ్వరూ చూడ్లేదు. సీట్ల కింద చెత్తా చెదారం తుడిచి నందుకు రూపాయో, అర్ధ రూపాయో ఇస్తే తీసుకొని పంచుకుంటాం సార్...'' అన్నాడు ఎర్రటోడు.

''అవునా... వాడు కంపార్ట్‌మెంటు తుడు స్తుంటే దొరికిన పర్సు నువ్వెందుకు లాక్కోబో యావు'' అన్నాను నల్లోని వైపు సీరియస్‌గా చూస్తూ.

''అది కాదు సార్...వాడు తుడిసిన కంపా ర్ట్‌మెంటు నాది సార్..'' అన్నాడు నల్లోడు..

ఆశ్చర్యం వేసింది నాకు.

''నీదా? నీదంటే నీ యబ్బ సంపాదించి ఇచ్చిందా రాస్కెల్''

''కాద్సార్...మేము రైలు కంపార్ట్‌మెంట్లని తుడవడానికి ముందు పంచుకుంటాం. రైల్లో మేం నలుగురం వున్నాం సార్... ఒక్కొక్కడు రెండు కంపార్ట్‌మెంట్లు తుడుచుకుందామని ముందే అనుకుంటాం. ఎవడు తుడుసుకొని అడుక్కున్న డబ్బులు వాడివే. కానీ సార్... కంపార్టుమెంటు నేను తుడుచుకోలేక వీన్ని తుడు చుకోమన్నాను. ప్యాసింజర్లు ఎంత ఇచ్చినా సెరి సగం పంచుకుందామనుకున్నాం సార్''

నల్లటోడు తుడుపుల పురాణం విన్న నాకు ఆసక్తి పెరిగి అన్నాను ''ఓర్నీ... పెద్ద కథే గదరా'' అని ముడుపుల పురాణంలా వుందే అనుకున్నాను నాలో నేను.

''అవును సార్ కంపార్ట్‌మెంటు లెక్క ప్రకారం వాడిదే. చొక్కా గుడ్డతో శుభ్రం చేసి ప్రయాణీకుల్ని అడుక్కోగా వచ్చింది పదిరూపాయలండీ. సెరి అయిదైదురూపాయలు తీసుకుందామన్నానండీ''

అన్నాడు న్యాయంగా పరిష్కరించినట్లు ఎర్రోడు.

''మరి ఇంకేంరా నీ అయిదు రూపాయలు తీసు కోకుండా వాడి మీదకి కుస్తీకి పోయావు?

''అది కాదు సార్... కంపాటర్ట్‌మెంటు నాదే. వాడు కంపార్టుమెంటులో చెత్త తుడిచిన చొక్కా గుడ్డ నాదే. నాకు ఏడు రూపాయలు ఇవ్వమన్నా నండి...'' నల్లోడు చెప్పినదాంట్లో న్యాయముందని

''ఏరా ఏడంట ఇచ్చేయ్ కూడదా?'' అన్నాను.


''ఆరు రూపాయలు ఇస్తానన్నాను. కానీ, ఈ పర్సులో వున్న దాంట్లో కూడా సగం డబ్బులు ఇచ్చి తీరాల్సిందే అంటున్నాడు సార్'' అన్నాడు

## ఆల్ ఇన్ వన్ గుమ్మడి



సర్వశుభాలకు ఉపయోగపడే గుమ్మడిని ఆల్ ఇన్ వన్‌గా చెప్పుకోవచ్చు. ఇందులో వుండే విట మిన్ ఎ క్యాన్సర్ నిరోధకంగా పనిచేస్తుంది. పొటాషియం, ఫాస్పరస్, ఐరన్, కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్, బీటాకెరోటిన్‌లు ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. పిల్లల నుంచి వృద్ధుల వరకూ అందరికీ ఉపయోగపడే గుమ్మడికి గృహప్రవేశా లలో పెద్ద పీటే వేశారు. గుమ్మం దగ్గర పండు గుమ్మడిని పగుల కొట్టిన తరువాత కానీ ఇంట్లోకి ప్రవేశించారు. అదే విధంగా ఇంట్లోకి వచ్చాక కూడా దిష్టి తగలకుండా బూడిదగుమ్మడిని ఇంటి ముందు వేలాడగడతారు. గుమ్మడిలో వుండే బీటాకెరోటిన్ చర్మ సౌందర్యాన్ని రెట్టింపు చేస్తుంది. కళ్లు, చర్మం తేమగా వుండేందుకు దోహ దపడుతుంది. ఇన్ని సుగుణాలు వున్న గుమ్మడితో చేసే హల్వా మంచి రుచిగా వుంటుంది. కొవ్వు శాతం తక్కువగా వుంటుంది కాబట్టి ఎంత తీసు కున్నా ఆరోగ్యానికి ఏమాత్రం చెడు జరగదు. పండగలకు పబ్బాలకు గుమ్మడిపువ్వే ప్రధాన ఆకర్షణ. సంక్రాంతి సమయంలో ఇంటి ముందు పెట్టే గొబ్బెమ్మలలోనూ, దసరా పండుగకు అంగ రంగ వైభవంగా జరుపుకునే బతుకమ్మకూ గొబ్బెమ్మ పూలే ప్రధానం. ఇన్ని ఉపయోగాలున్న గుమ్మడిని ఆల్ ఇన్ వన్ అనకుండా వుండ గలమా?

– కె.నిర్మల



ఎ్రరోడు.

ఇంకా ఏదో చెబుతున్నాడు ఎ్రరోడు

''సార్... వాడిని తుడువొద్దురా అని చెప్పి నేనే తుడుచుకుని వుంటే ఆ పర్సు నాకే వచ్చేది కదండీ సార్'' అన్నాడు నల్లోడు ఏదో లాజిక్‌గా.

వాళ్లిద్దరూ వాళ్ల లోకంలో ఏదేదో చెపుతున్నారు. వీరిద్దరికి నచ్చినట్లు ఎలా న్యాయం చెప్పాలో తోచక చాలా సేపు సందిగ్ధంలో పడ్డాను.

''సరేరా... ఆ పర్సులో ఎంతుంది పైకం..? ఎ్రరోడి వైపు తిరిగి ప్రశ్నించాను.

''ఆరు నూర్లున్నాయి సార్...''

''ఆరు నూర్లే...'' అంటూ ఆశ్చర్యంగా వాడి కేసి చూశాను.

''అవునండి సార్...!'' అన్నాడు నల్లోడు.

''మరి... అందులో నువ్వు ఎంతిస్తానన్నావురా వాడికి?'' అని అడిగాను.

''రెండు నూర్లు తీసుకో...నేను నాలుగు నూర్లు తీసుకుంటానన్నాను. సార్. కాదు కూడదు నాలుగు నూర్లు ఇస్తావా... ఇవ్వవా..? అని దొరికిన పర్సు లాక్కోబోతున్నాడు సార్...'' అన్నాడు ఎ్రరోడు.

''ఏరా చెత్తా చెదారం తుడిచింది వాడు. పర్సు అదృష్టంగా దొరికింది వాడికి. వాడు రెండొందలు ఇస్తానన్నాడుగా. మరెందుకు తీసుకోవు. నాలుగు వందలిమ్మని ఎందుకు అడిగావు? వాడి చేతులో పర్సు నువ్వెందుకు లాగేసుకోబోతున్నావు?'' అని ఒక్క క్షణం మౌనంగా వుండి... ''సరే ఆ పర్సు ఇవ్వరా ఎ్రరోడా.. నేను మీ ఇద్దరికి అనుకూలంగా న్యాయం చెపుతాను. దీనికి మీరిద్దరూ చచ్చినట్లు ఒప్పుకోవాలి. లేదా...జైల్లో కుక్కేస్తాను'' అన్నాను సీరియస్‌గా వాళ్ల వైపు చూస్తూ.

వాళ్లిద్దరూ ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఇద్దరూ తలలు వాల్చేసి నేల చూపులు చూస్తూ నిలబడిపోయారు శిల్పాల్లా..

''ఏరా! మీకే చెప్పేది...పలకరేం.. ఎ్రరోడా ఇట్రారా... ఆ పర్సు తీసి ఇలా ఇచ్చేసేయ్..నీకు ఓ మూడొందలు నల్లోడికి మూడొందలు పంచేస్తాను. కంపార్టుమెంటులో వూడ్చిన దాంట్లో సెరిసగం అంటే అయిదయిదు రూపాయల చొప్పున పంచేస్తాను. ఆ డబ్బుల పర్సు బయటకు తీయరా'' అన్నాను ఎ్రరోడి వైపు చూస్తూ మరోసారి గట్టిగా

''పర్సు లేదు సార్... పదిరూపాయలు లేవు సార్...'' అన్నారు ఇద్దరూ ఒకేసారి ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ...

''ఏం చేశారు..?'' గుడ్లురిమి చూశాను ఆశ్చర్యంగా..

''మేమిద్దరం రైలు దిగి డబ్బుల దగ్గర గొడవపడుతుంటే మఫ్టీ పోలీసు మెల్లగా మా దగ్గరకొచ్చి ''ఏరా! పర్సు ఎక్కడ కొట్టేశారు'' అని వీపు మీద లాఠీతో రెండు దెబ్బలు కొట్టి నా చేతిలో పర్సు లాక్కున్నాడు సార్'' అన్నాడు ఎ్రరోడు.

''ఎవరూ? ఇందాక రైలు కదులుతుంటే లాఠీ పట్టుకొని ఎక్కిపోయిన కానిస్టేబులా?''

''అవునండి సార్''

''నీవు తుడిచిన డబ్బులు పది రూపాయలు ఏంచేశావు?''

''అవి కూడా చెవులు పిండి లాక్కొని పోయారు సార్''

వాళ్ల సమాధానం విన్నాక నాకు తల తిరిగిపోయింది. నేను ఏం తీర్పు చెప్పాలో తోచలేదు.

ఎక్కడో ఆకాశం అంచుల్లోకి చూస్తూ అలా కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయాను.

''అయితే మీ దగ్గర ఇప్పుడు డబ్బులేం లేవు''

''అవునుసార్.. ఏమీ లేవు సార్'' అన్నారు ఇద్దరూ

''మరెందుకురా అలా కుక్కల్లా పొట్లాడుకుంటూ తన్నుకు చచ్చారు! వెధవల్లారా...'' అన్నాను కోపంగా.

''.....''

మౌనమే వాళ్ల నుంచి నాకు అందిన సమాధానం.

ఎంత విచిత్రం. చేతులకందిన డబ్బు అనుభవించకుండా మరొకడు గద్దలా తన్నుకుపోయాడు. పైగా ఇద్దరూ చచ్చేటట్టు కొట్టుకున్నారు. భగవాన్! న్యాయం ఎక్కడుంది? ఎందుకో ఆ క్షణంలో మెరుపులా రెండు పిల్లులు, తగవులాడి కోతి న్యాయం కోరిన కథ గుర్తుకు వచ్చింది. నాలో నేను నవ్వుకున్నాను. అదేదో ఆన్సర్ అయినట్టు.

''నాతో రండి'' అన్నాను. బెంచీ మీద నుంచి లేస్తూ....

''సార్ మమ్మల్ని వదిలేయండి సార్. ఇంకెప్పుడూ కొట్లాడుకోం'' అన్నారు జంకుతూ

''వదిలేది లేదు నాతో వస్తారా రారా...?'' అన్నాను గద్దించి.

తలవంచుకొని నన్ను అనుసరించారు వాళ్లిద్దరు నాతో పాటు ఓ హోటల్ వరకూ...

హోటల్లోకి నేను ప్రవేశిస్తుంటే వాళ్లిద్దరూ బయటే ఆగిపోయారు.

''ఏం ఆగిపోయారేం? రండి'' అన్నాను. మారు మాట్లాడకుండా వాళ్లు హోటల్లోకి వచ్చారు.

ముగ్గురం ఓ టేబుల్ ముందు కూర్చున్నాం. సప్లయర్ రాగానే మూడు దోశెలు ఆర్డరు ఇచ్చాను. అవి తెచ్చి టేబుల్ మీద పెట్టగానే వాళ్లిద్దరూ నోరెత్తకుండా గబగబా తింటుంటే అలా చూస్తూ నేను దోశె తినేసాను.

''వెధవల్లారా...బాగా తన్నుకొని ఆకల్తో వున్నారు కదూ...'' అన్నాను.

అదోలా నవ్వారు నా వైపు చూడకుండానే.

''రేయ్.. మీరెవరో నాకు తెలీదు. నేను ఎస్.ఐని కాదు. పిచ్చిపిచ్చిగా మీరిద్దరూ కలబడి ప్లాట్‌ఫారం మీద తన్నుకోవడం చూసి అలా భయపెట్టాను. ఎందుకురా ఇలా మీ బ్రతుకులు! చదువుకోకూడదు? చదువుకోవడం ఇష్టం లేకపోతే ఏదైనా వృత్తి నేర్చుకొని బతక్కూడదా? ఇంకెప్పుడూ ఇలా తన్నుకోకుండా ఏదైనా పనిచేసుకొని బతుకుతాం సార్'' అంటూ నా చేతిలో చేయి వేసి చెబుతారా లేదా?'' అన్నాను సీరియస్‌గా

''ఇంకెప్పుడూ ఇలాంటి పన్లు చేయం సార్...కొట్టుకోం... ఏదైనా వృత్తివిద్య ఎక్కడైనా నేర్చుకొని బ్రతుకుతాం సార్....'' అంటూ వాళ్లిద్దరూ చేతులు చాచి నా చేతిలో చెయ్యివేశారు.

కాఫీ తాగాక నేను డబ్బులు చెల్లించి బయటకు వచ్చి ''వెళ్లిపోండి... మీరిద్దరు అన్నదమ్ముల్లా వుండాలి తెలుసా'' అన్నాను.

''అలాగే సార్....'' అంటూ వాళ్లిద్దరూ హోటల్ మెట్లు దిగి అలా బజారు జనంలో కలిసిపోయారు.

నేను ఆ క్షణంలో కదలికలు లేని ఓ శిల్పంలా వెళ్లిపోతున్న వాళ్లకేసి చూస్తూండిపోయాను. అంత కంటే నేనేమీ చేయలేక.

★